

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా చూడాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కృష్ణకాలనీ, ఏప్రిల్ 4 : పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులపై ఉందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీవో, ఏపీవోలకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో అవలంభించాల్సిన విధి, విధానాలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియపై పీవో, ఏపీవోలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి 560మంది హాజరుకావాల్సి ఉండగా 22మంది గైర్హాజరయ్యారని, వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. గురువారం శిక్షణకు హాజరుకాలేక పోయినా వారు 6న నిర్వహించే శిక్షణకు తప్పకుండా హాజరుకావాలన్నారు. ఆ రోజూ గైర్హాజరైతే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు శ్యామ్యూల్, అవినాశ్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి నారాయణ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ, ఆర్డీవో మంగీలాల్ పాలొన్నారు.

లాభదాయకమైన పంటలు సాగుచేయాలి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కోతకు గురైన గోదావరి తీరం పరిశీలన

ఏటూరునాగారం : రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

మంగపేట/ ఏటూరునాగారం ఏప్రిల్ 4 : కాలానుగుణంగా పంట మార్పిడి చేస్తూ రైతులు లాభదాయకమైన పంటలు సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. గురువారం ఆమె మంగపేట, ఏటూరునాగారం మండలాల శివారులో కోతకు గురైన గోదావరి తీరాలను పరిశీలించారు. మంగపేట మండల కేంద్రంలోని పొదుమూరు సమీపంలో ఉన్న పుష్కరఘాట్ నుంచి ఎగువకు కోతకు గురైన గోదావరి తీరం, నదీ గర్భంలో కలిసి పోయిన పంట పొలాలను ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ 2.5 కిలో మీటర్ల మేర నదీ తీరం కోతకుగురై పంట పొలాలు నదిలోకలిసి పోయాయి. 2022లో సర్వే చేసి, కరకట్ట నిర్మాణానికి ఇక్కడ 25ఎకరాల మేర భూమి అవసరమౌతుంని గుర్తించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే ఏటూరునాగారం మండలంలోని ముంపు ప్రాంతాలు రాంనగర్, కోయగూడెం, రామన్నగూడెం గ్రామాలను కలెక్టర్ పరిశీలించారు. రాంనగర్ ప్రాంతంలో 6 కిలో మీటర్ల మేర నిర్మించనున్న కరకట్టకు 102 ఎకరాల్లో 2022లో స్థల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

మిర్చి తోటలను పరిశీలించిన కలెక్టర్

ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట గ్రామం సమీపంలోని మిర్చి తోటలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కాలానుగుణంగా పంట మార్పిడి చేయాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలపై రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌భాస్కర్, ఎస్ఈ మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జగదీశ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చందర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి వే ణు, మంగపేటతహసీల్దార్ వీరస్వామి, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

టేకుమట్లలో పరమార్శిస్తున్న ఎమ్మెల్సీ చారి

మృతుల కుటుంబాలకు సిరికొండ పరామర్శ

టేకుమట్ల, ఏప్రిల్ 4 : మండలకేంద్రంలోని మియపురం లక్ష్మీబాయి, భూపతి వీరయ్య ఇటీవల మృతి చెందగా గురువారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎంపేడు గ్రామానికి చెందిన కొత్తపల్లి రాములు కాలు విరిగి మంచానికే పరిమితమవగా అతడిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ పోతనవేణి ఐలయ్య, బొడ్డు సదానందం, నేరేళ్ల శ్రీనివాస్, పాల శంకర్, ఓదెల రాజు, ఖాజా మియా, సర్వర్ ఉన్నారు.

నేడు విద్యుత్ కోతలు

ములుగురూరల్, ఏప్రిల్ 4 : ములుగు మండలంలో సబ్ స్టేషన్ల మరమ్మతు పనుల నిమిత్తం నేడు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఆ శాఖ ఏఈ సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు, పత్తిపల్లి, సబ్ స్టేషన్ల పరిధిలో పత్తిపల్లి ఫీడర్‌తో పాటు సర్వాపురం ఫీడర్‌లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం, ఏపీఎంలు

మంగపేట, ఏప్రిల్ 4 : మండలంలోని తిమ్మంపేట, చెరుపల్లి, నర్సింహసాగర్ గ్రామాల్లో సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం గోవిందచౌహాన్ ఏపీఎం అప్పారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో గాయత్రి, సీసీలు జనార్దన్, శ్రీను, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

గద్ద సురేశ్

మహదేవపూర్ (కాటారం), ఏప్రిల్ 4 : కాటారం మండలంలోని ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన గద్ద సురేశ్ ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినీ ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కూతురు వోత సుజాత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

వెంకటాపురం (నూగూరు), ఏప్రిల్ 4 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా పైప్‌లైన్లు మరమ్మతు చేయించడంతో పాటు లీకేజీలను అరికట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, క్లోరినేషన్ చర్యలు చేపట్టలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి, డీడబ్ల్యూవో స్వర్ణలత, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపీవో హనుమంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, మిషన్ భగీరథ ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు కనీస సౌకర్యాలు లేవు

ఏటూరునాగారం, ఏప్రిల్ 4 : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు తాగు నీరు, ఫస్ట్ ఎయిడ్ వంటి సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి జాగటి చిన్నా అన్నారు. ఉపాధి హామీ పనులను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు, తాగు నీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సేద తీరడానికి టెంట్లు వేయకపోవడంతో కూలీలకు నీడ కరువవుతోందన్నారు. కూలీలు మండుటెండలో పనిచేస్తుంటే కనీస నీటి సౌకర్యం కల్పించడంలేదని అధికారులపై మండిపడ్డారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఏఎల్ వోకు వినతి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 4 : కార్మిక శాఖ కనీస వేతనాలను సవరించాలని కోరుతూ పెట్రోబంకుల కార్మికుల యూనియన్ కమిటీ నాయకులు గురువారం అసిస్టెంట్ లేబర్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు ఆకుదారి రమేశ్ మాట్లాడుతూ కార్మిక శాఖ కనీస వేతనాలను సవరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మల్హర్, ఏప్రిల్ 4 : మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో ఆదేశాల మేరకు గురువారం కార్యదర్శి రాజు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండల తీవ్రత దృష్ట్యా గ్రామస్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ సమీపంలోని జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటుకు స్థల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

వాజేడు, ఏప్రిల్ 4 : యాసంగి ధాన్యం అక్రమంగా పోరుగు రాష్ట్రం నుంచి తరలిరాకుండా ఉండేందుకు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటుకు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ స్థలాన్ని పరిశీలించారు. గురువా రం ఆయన రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మండలంలోని చెరుకురు గ్రామం వద్ద ఉన్న హైదరాబాద్ టూ భూపాలపట్నం 163 జాతీయ రహదారిని సందర్శించారు. చెక్ పోస్టు ఏర్పాటు కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలను చేశారు. ఆయన వెంట ఏవో గుంటక నర్సింహారావు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన బైక్ : ఒకరి మృతి

మహదేవపూర్, ఏప్రిల్ 4 : రోడ్డుపై ఆగివున్న డీసీఎం వ్యాన్‌ను బైక్ ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని బొమ్మాపూర్ ఎస్సీ కాలనీ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై-2 చక్రపాణి, స్థానికుల కథనం ప్రకారం.. ఎడపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రత్న లచ్చిరెడ్డి (58) మహదేవపూర్ నుంచి ద్విచక్ర వాహనంపై అంబట్‌పల్లి గ్రామానికి వెళ్తున్న క్రమంలో బొమ్మాపూర్ ఎస్సీ కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై ఆగివున్న డీసీఎం వ్యాన్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో రత్న లచ్చిరెడ్డి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై -2 చక్రపాణి తెలిపారు.

లీగల్ సెల్ కన్వీనర్ నియామకం

ములుగురూరల్, ఏప్రిల్ 4 : బీజేపీ ములుగు జిల్లా లీగల్ కన్వీనర్‌గా న్యాయవాది కన్నోజు సునీల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం గురువారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం పనిచేస్తానని అన్నారు.

పంట పొలంలో భూ ప్రకంపనలు

15ఫీట్ల లోతు కోతకు గురైన భూమి

రెండు గుంటల్లో 15 ఫీట్ల వరకు కోతకు గురైన భూమి

ములుగురూరల్, ఏప్రిల్ 4 : పంట పొలంలో భూమిలో కదలికలు వచ్చి ప్రకంపనకు గురైంది. ఈ సంఘటన ములుగు మండలం రామచంద్రాపురం శివారులో గురువారం ఉదయం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన రైతు నూనావత్ పంతులుకు ములుగు మండలం రామచంద్రాపురం శివారులో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో మక్కజొన్న సాగు చేశాడు. కాగా, బుధవారం ఉదయం అకస్మాత్తుగా రెండు గుంటల పొడవులో 15ఫీట్ల లోతు వరకు భూమి కోతకు గురైంది. చుట్టుపక్కల ఉన్న రైతులు గమనించి విషయాన్ని రైతుతో పాటు గ్రామస్తులకు తెలియజేశారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. గతంలో రెండు మూడు సార్లు ఇలానే గ్రామంలో జరిగిందని, ప్రస్తుతం జరిగిన సంఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల చేస్తున్న మైనింగే కారణమా? లేక అధిక మొత్తంలో బోరు బావులు ఉన్నందుకు భూ ప్రకంపణలు వస్తున్నాయా అనేది తెలియాల్సి ఉంది. మైనింగ్, రెవెన్యూ అధికారులు దీనిని నిర్ధారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 4 : వేసవికాలం దృష్ట్యా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్, గణేష్ చౌక్‌లో ఏ ర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ఎండ వేడిమి నుంచి ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని, చిన్న పిల్లలను ఎండలో తిరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కూ లీలు, కార్మికులు ఉదయం పూటే పనులు ముగిం చుకోవాలని, లేకుంటే వడదెబ్బకు గురై అనారోగ్యం పాలవుతారన్నారు. మున్సిపల్ కమిషన ర్ రాజేశ్వర్, ఆర్ఐ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికార్జునఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి
దిష్టిబొమ్మల దహనం

ఖర్గే, రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ములుగురూరల్, ఏప్రిల్ 4 : కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను బుధవారం మహాజన సోషల్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు దిష్టిబొమ్మలను దహనం చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలు ఉంటే ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ మాలల పార్టీగా మారిందని, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే తన మాల కులస్తులకే ఎంపీ సీట్లు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం మాలల చేతిలో బందీ అయ్యారని విమర్శించారు. మాదిగ జనాభా 75శాతం ఉన్న మూడు స్థానాల్లో కనీసం రెండు సీట్లు కూడా కేయించకపోవడం మాదిగలను అణచివేతకు గురి చేయడమేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు మరాఠి రవీందర్, వావిలాల సాంబశివరావుతో పాటు ఎంపెల్లి శంకర్, రాంబాబు, బొచ్చు అరవింద్, పడిదల జగన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి జడ్పీ సీఈవో విజయలక్ష్మి

ఉపాధి పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విజయలక్ష్మి

చిట్యాల, ఏప్రిల్ 5 : గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో విజయలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని చిట్యాల, చల్లగరిగె గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశంలో కల్పిస్తున్న వసతులపై ఆరా తీసినట్లు తెలిపారు. ఇక నుంచి కూలీలకు రోజు రూ.300 చొప్పున అందజేస్తామని తెలిపారు. కూలీలకు పని కల్పించేలా ప్రదేశంలో రెండు సార్లు ఫొటోలు తీసిన ప్పుడే వారికి డబ్బులు జమ అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాలని సూచించారు. ఎండలు పెరుగుతున్నందున రైతులు ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకొని ఇంటికి చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అలీంపాషా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో నివాసం ఏర్పర్చుకుంటే కఠిన చర్యలు

ములుగు, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : అటవీ ప్రాంతాల్లో గొత్తికోయలు కొత్తగా స్థిర నివాసం ఏర్పర్చుకునే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్వో శంకర్ హెచ్చరించారు. గురువారం వెంకటాపూర్ మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న చాకిరేవు వద్ద గొత్తికోయలు నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించగా వారిని అడ్డుకొని అటవీ శాఖ అధికారులతో పాటు పోలీస్ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. గొత్తికోయగూడేల్లో కొత్త వారికి ప్రవేశం లేదని చెప్పి వారి సొంత ప్రదేశాలకు తిరిగి పంపించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్వో మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన గొత్తికోయలు చాకిరేవు వద్ద ఉన్న గొత్తికోయల వద్దకు స్థిర నివాసం ఏర్పర్చుకునేందుకు వచ్చినట్లు సమాచారం అందిందన్నారు. డీఎఫ్‌వో ఆదేశాల మేరకు రామకృష్ణాపూర్ గ్రామానికి వచ్చి గొత్తికోయలకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి పంపించినట్లు తెలిపారు. గతంలో ఉన్న గూడేలలో కొత్త వారికి ఆశ్రయం ఇచ్చినట్లు రుజువు అయితే సంబంధిత గ్రామాలు, గూడేల్లో ఉన్న వారిపై కూడా అటవీ హక్కుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి అడవుల నుంచి బయటకు పంపించనున్నట్లు హెచ్చరించారు.

లాభాల బాటలో భూపాలపల్లి ఏరియా

కృష్ణకాలనీ, ఏప్రిల్ 4 : గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో సింగరేణి సంస్థ భూపాలపల్లి ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి రవాణా లక్ష్యాలు, భూగర్భ గనుల విషయంలో తప్పా ఉపరితల గనుల ద్వారా నష్టాల శాతాన్ని తగ్గిస్తూ లాభాల బాటలో పయనిస్తున్నామనీ భూపాలపల్లి జీఎం బళ్లారి శ్రీనివాసరావు తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ. (-) 518.61 కోట్ల నష్టంలో, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. (-)557.20కోట్ల నష్టంలో ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం ద్వారా ఏరియా నష్టం రూ.518 కోట్ల నుంచి రూ.398.22కోట్లు తగ్గించుకోగలిగామన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ భూగర్భ గనుల విషయంలో భూపాలపల్లిలో ఇసుక కొరత, గ్రేడియెంట్, ఎస్టీఎల్ యంత్రాల జీవిత కాలం ముగియడంతో కొంతమేరు ఉత్పత్తి తగ్గిన బాటమ్ యాష్ కొరకు గోదావరి ఇసుక టెండర్ ప్రిక్రియ ప్రీ చేసినట్లు చెప్పారు. కొత్త ఎస్డీఎల్ యంత్రాల కొనుగోలుకు టెండర్ ప్రక్రియ పూర్తియిందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరాల ఉత్పత్తి, ఉత్పాదకతతో పోలిస్తే భూపాలపల్లి ఏరియా దాదాపు 12 లక్షల టన్నుల అధిక ఉత్పత్తి సాధించి ఏరియా నష్టాలను తగ్గించి లాభాల బాటలో పయనించడానికి నాంది పలికామన్నారు.

నేడు కలెక్టర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 4 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ మిటీంగ్ హాల్ (ఐడీఓసీ)లో నేడు ఉదయం 10 గంటల నుంచి భారత మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు జిల్లాలోని అధికారులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, కుల సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మందకృష్ణను విమర్శించే హక్కు ఎమ్మెల్యే రేవూరికి లేదు

గాజుల భిక్షపతి

గణపురం, ఏప్రిల్ 4 : ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏండ్లుగా ఉద్యమాలు చేస్తున్న మంద కృష్ణ మాదిగపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి గాజుల భిక్షపతి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీలు మారుతూ ప్రజలను మోసం చేసే రేవూరి మాదిగ జాతి ఓట్లతో ఎమ్మెల్యేగా ఎన్నికై అధికార దాహంతో ఎక్కువగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మందకృష్ణపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

ఒంటిపతండాలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

ఒంటిపతండాలో కార్డన్ సెర్చ్

చిట్యాల, ఏప్రిల్ 4 : మండలంలోని అందుకు తండా గ్రామ శివారు ఒంటిపతండాలో డీఎస్పీ సంపత్ రావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సరైన ధృవపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 24 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే 25 లీటర్ల గుడుంబా, 1,700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. యువత విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గంజాయి, గుట్కా, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చిట్యాల సీఐ డీ మల్లేశ్ యాదవ్, ఎస్సై జీ శ్రావణ్ కుమార్, రేగొండ ఎస్సై రవికుమార్, టేకుమట్ల ఎస్సై ప్రసాద్, చిట్యాల పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ బృందం పాల్గొన్నారు.

ఆధారాలు లేని నగదు సీజ్

ములుగురూరల్, ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మల్లంపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం సాయంత్రం చెక్‌పోస్టు వద్ద ములుగు ఎస్సై-3 లక్ష్మారెడ్డి వాహనాల తనిఖీ చేస్తుండగా వెంకటాపూర్ మండల ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండారి ప్రణయ్ భాస్కర్ రూ. 2,01,570 వెంట తీసుకెళ్తుండగా నిబంధనల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే మరో వాహనంలో వరంగల్ పెరుకవాడకు చెందిన పెరుమాండ్ల రంజిత్‌కుమార్ రూ.55,040 తీసుకెళ్తుండగా సీజ్ చేసి మొత్తం రూ.2,66,610 జిల్లా గ్రీవెన్స్ సెల్ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wardens (Female)-4, Telecallers-2, Attractive Salary for deserved candidates. Contact: SUVIDYAA Jr. College, for girls, Nakkalagutta, HNK, Cont: 8885599155, 8885599166,
NTW-00

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882

HMDA & RERA PLOTS

★3-5 సంవత్సరాలలో Future City బీబీనగర్‌లో 200 ఎ।। AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA & RERA ప్లాట్లు 60% లోన్‌తో గేటెడ్ కమ్యూనిటీలో కలవు: 8109994456.
NT-320386

CHANGE OF NAME

★I, MOHAMMAD ABDUL KHUSRO SHAKEEL, R/o. 2-7-898, Alipura, Badi Masjid, Subedari